'ఏది గంధవంతమో అది ఇతర భిన్నమయినది' అను ఈ అన్వయవ్యాప్తికి దృష్టాంతం దొరకదు, పృధివి తప్ప. కనుక "యత్ర ఇతర భేదాభావః తత్ర గంధాభావః యథాజలే" – **ఇది వ్యతిరేక వ్యాప్తి.**

**అర్థాపత్తిని "కేవల వ్యతిరేకి"లో చేరుస్తారు తార్కికులు.**

**అద్వైత సిద్ధాంతంలో కేవల వ్యతిరేకి అయిన అనుమానం లేదు. అందువలన వారు అర్థాపత్తిని అంగీకరిస్తారు.**

కేవల వ్యతిరేకి అయిన అనుమానములో

1) అన్వయ వ్యాప్తికి ఉదాహరణము లేదు.

2) సాధ్యాభావమునందు హేత్వభావమునకు మాత్రము ఉదాహరణం దొరకుతుంది.

పృధివి ఇతర భేదం గలది – గంధం గలది కనుక. **దీనికి అన్వయ వ్యాప్తి ఇలా ఉంటుంది.** ఎక్కడ గంధవత్త్వం ఉంటుందో అచ్చట ఇతర భేదం ఉంటుంది – దీనికి పృధివి తప్ప మరో ఉదాహరణం దొరకదు. ఇచ్చట పక్షమయిన పృధివి కన్న భిన్నమయిన 'గంధవత్' దొరకాలి. (పర్వతం కన్న భిన్నమయిన మహానసం ఉన్నట్లు) కనుక అట్టి పదార్థం ఏదీ లేదు. పక్షం కన్న భిన్నమయిన 'సపక్షం' లేదు.

ఇక వ్యతిరేకానుమానం చూద్దాము.

"ఎచ్చుట ఇతర భేదం లేదో అచ్చుట గంధం లేదు – జలం లాగా"

(ఎచ్చుట వహ్ని లేదో అచ్చుట ధూమం లేదు – అన్నట్లు 'జలం' ఉదాహరణం. వ్యాప్తి జ్ఞానమునకు హేతువు అయిన "సాహచర్యం" గలది ఉదాహరణము.

"అన్వయి" అయిన అనుమానమునందున్న వ్యాప్య – వ్యాపకభావానికి తలక్రిందులుగా "వ్యతిరేకి" అయిన అనుమానములోని "వ్యాప్యవ్యాపకభావం" ఉండును.

**అన్వయి** యందు హేతువు = ధూమము = వ్యాప్యము (వహ్ని వ్యాప్యము) సాధ్యము (వహ్ని) వ్యాపకంగా ఉంటుంది.

**వ్యతిరేకి**యందు సాధ్యాభావము (వహ్ని అభావం) వ్యాప్యము. హేత్వభావము (ధూమాభావము) వ్యాపకము.

ఈ విషయంలో న్యాయమతములలో రెండు పద్ధతులున్నవి.

a) సాధ్యాభావమునందు హేత్వభావం యొక్క సాహచర్యం ఉన్నది. (వహ్ని లేని చోటనల్లా ధూమం ఉండదు) అందువలన హేత్వభావం యొక్క సాహచర్యం గూడా సాధ్యాభావము నందున్నది. అయితే **ఇందులో దోషం ఉన్నది.**

పదార్థమునందున్న వ్యాప్తి జ్ఞానము వలన సాధ్యమయిన ఆ పదార్థమునకు అనుమితి కలుగుతుంది. (వహ్నియందున్న వ్యాప్తి జ్ఞానము వలన వహ్నిని అనుమితి చేయవచ్చును)

పరస్పరము వ్యాప్య వ్యాపక భావము లేని పదార్థముల మధ్య "హేతు సాధ్య" భావము ఉండదు. ఇతర భేదాభావం (పృధివిలో) వ్యాపకం గంధాభావం వ్యాప్యం. కనుక వీటి మధ్య వ్యాప్య వ్యాపక భావమున్నది. కాని

గంధ - ఇతర భేదముల మధ్య వ్యాప్తి లేదు. మరి గంధం వలన (హేతువు) ఇతర భేదం సాధ్యం ఎలా అవుతుంది ? అందువలన

సాధ్యాభావ (ఇతర భేదాభావ) హేత్వభావ (గంధాభావ) ముల మధ్య సాహచర్యం ఉన్నది కనుక హేతువునందు (గంధము) సాధ్యము యొక్క (ఇతర భేదం) వ్యాప్తి జ్ఞానం కలుగుతున్నది. (అంతేగాని హేత్వభావ సాధ్యాభావములకు - ధూమా భావ వహ్ని అభావములకు) సాహచర్యం వ్యాప్తిజ్ఞానం లేదు)

అన్వయ వ్యతిరేకులయిన అనుమానముల మధ్య ఒక భేదమున్నది.

హేతు (ధూమం) సాధ్యము (వహ్ని)ల సాహచర్య జ్ఞానం చేత హేతువు నందు వ్యాప్తి జ్ఞానం ఉన్నది **"అన్వయి-అనుమానము"**.

సాధ్యాభావమునందు హేత్వభావం యొక్క (వహ్ని-ధూమ అభావాలు) సాహచర్య దర్శనం వలన హేతువునందు (ధూమము) సాధ్య వ్యాప్తి (వహ్ని) తెలుస్తుందో అది **'వ్యతిరేకి-అనుమానము'**

దేనివలననయినా రావలసినది.

"హేతువునందు సాధ్య వ్యాప్తి జ్ఞానం"

(రామాదివత్ వర్తితవ్యం" అన్నా **"రావణాదివత్ న వర్తితవ్యం"** అన్నా ప్రయోజనం ధర్మప్రవర్తనయే గదా!)

సాధ్యాభావమునందు (వహ్ని) హేత్వభావం యొక్క (ధూమ) వ్యాప్తిజ్ఞానం ఒకపుడు కలుగదు. కలిగినచోట సాధ్యాభావము చేత హేత్వభావానుమితియే కలుగుతుంది.

A) హేతువు చేత సాధ్యానుమితి కలుగదు. B) వాటిమధ్య వ్యాప్తి ఉండాలి. కనుక వ్యాప్య (ధూమం) జ్ఞానం చేత వ్యాపకానుమితి కలుగుతుందనాలి.

ఇందులో 'A' పక్షము. ప్రాచీన నైయాయికులది.

'B' పక్షము. నవీనులది.

ఇదంతా అత్యంత కఠినము కనుక విస్తరించి వ్రాయలేదు.

**II. కేవలాన్వయి అనుమానము**

సాధ్యాభావ హేత్వభావము యొక్క సాహచర్యమునకు ఉదాహరణము దొరకనిచోటు కేవలాన్వయి. అనగా (దొరకినచోటు కేవల వ్యతిరేకి). వ్యతిరేక వ్యాప్తిలేనిది. చూ॥ ఉదా॥

"ఘటః పదశక్తిమాన్ – జ్ఞేయత్వాత్

పదవత్ – దీనికి వ్యతిరేక వ్యాప్తి లేదు.

ఎందుకంటే పదశక్తులు, జ్ఞేయత్వము లేనివి లేవు. కనుక వ్యతిరేక వ్యాప్తి కుదరదు.(యత్ర పదశక్తిః నాస్తి తత్ర జ్ఞేయత్వం నాస్తి)

**III. అన్వయ వ్యతిరేకి – అనుమానము**

ఇది ప్రసిద్ధమయిన అనుమానము. దీనిలో అన్వయవ్యాప్తి, వ్యతిరేక వ్యాప్తి ఉంటాయి.

"పర్వతో వహ్నిమాన్ ధూమాత్" = యధామహానసః

దీనికి 1) యత్ర యత్ర ధూమః తత్రాగ్నిః – అన్వయవ్యాప్తి

2) యత్ర వహ్నిః నాస్తి తత్రధూమోపి నాస్తి –

యధాహ్రదః - వ్యతిరేక వ్యాప్తి

## 2/59 వేదాంతరీత్యా "ఏకాన్వయి, అన్వయ వ్యతిరేకి, అనుమానం, అర్థాపత్తుల" విచారణ

వేదాంతమునందు కేవల వ్యతిరేకి యొక్క ప్రయోజనమును అర్థాపత్తి కలిగిస్తున్నది. చూ॥

ఇతర భేదము లేక "గంధవత్త్వము" సిద్ధించదు. కనుక గంధవత్త్వము యొక్క అనుపపత్తి వలన ఇతర భేదము సిద్ధిస్తుంది. ఇది అర్థాపత్తి. బ్రహ్మం విషయంలో "కేవలాన్వయి" అయిన అనుమానము కుదరదు. ఎందుకంటే;

బ్రహ్మమునందు సర్వపదార్థములు లేవు. కనుక అభావమున్నది. అందువలన వ్యతిరేక సాహచర్యమునకు బ్రహ్మము ఉదాహరణము. బ్రహ్మము వృత్తి జ్ఞానమునకు విషయం అవుతుంది. (దాని ఆవరణ భంగం అవుతుందిగదా). కాని ప్రత్యక్షంగా జ్ఞేయం కాదు. ఇలా విషయం కావటమే అది 'జ్ఞేయం' కావడం. కనుక జ్ఞేయత అలా ఉన్నది. అయినా అది మిధ్యయే. అట్టి మిధ్యలు వాటి అభావములు గూడా బ్రహ్మమునందే ఉన్నవి. అనగా పదార్థములు దాని అభావములు సమానాధికరణంగా / ఏకాధికరణంగా బ్రహ్మమునందే ఉన్నాయి. కనుక కేవలాన్వయి అయిన అనుమానము లేదు. దాని ఉదాహరణయు ఉండదు.

అందువలన కేవల వ్యతిరేకి అనుమానముంటుంది. అయితే దానితోబాటు అర్థాపత్తి అవసరము. ఈ రెండూ ఆయా జ్ఞానములు (వ్యవసాయం) ఏర్పడుటను బట్టి వచ్చును. ఉదా : అగ్నిని చూచినపుడు

అగ్నిని చూస్తున్నాను (సాక్షాత్కారోమి) అని "అను వ్యవసాయము" (జ్ఞానం తరువాత వచ్చే జ్ఞానము) ఏర్పడును. పర్వతం మీద ధూమం వలన అగ్నిని ఊహిస్తే - "అగ్నిం అనుమినోమి" అని "అను వ్యవసాయము" ఏర్పడును. శబ్దం ద్వారా అయితే 'శబ్ద జ్ఞానం ద్వారా అగ్ని తెలిసింది' అని అనువ్యవసాయము. "వహ్ని-సూర్యుడు' లాగా ఉన్నది" అన్న జ్ఞానం తరువాత 'సూర్యునితో అగ్నిని పోలుస్తాను' అన్న 'అను వ్యవసాయం' ఏర్పడుతున్నది. **జ్ఞాన విషయంగా వచ్చిన**

**మరో జ్ఞానమును 'అనువ్యవసాయం' అంటారు.** కనుక వ్యవసాయ జ్ఞానం కలిగించే ప్రమాణాలలోని ప్రత్యక్ష అనుమానాది భేదం వలన అనువ్యవసాయం గూడా మారుతుంది.

**"గంధముచేత** భూమియందు

ఇతర భేదమును ఊహించుచున్నాను" అన్నచోట అనుమాన ప్రమాణంతోను, **"గంధం కుదరకపోవటం వలన** భూమియందు ఇతర భేదమును కల్పించెదను" అన్నచోట అర్ధాపత్తితోను అనువ్యవసాయం అవుతుంది. కనుక

వ్యవసాయభేదం వలన అనువ్యవసాయ భేదం వలన రెండు రకాల ప్రమాణాలు వస్తాయి. ప్రమాణ భేదం అసలు అనువ్యవసాయ భేదం వలననే వస్తున్నట్లు అందున శబ్ద ప్రమాణము ఎక్కువగా అనువ్యవసాయము చేతనే సిద్ధమగునని **'శబ్దశక్తి ప్రకాశికాది** గ్రంధములందున్నది. **కనుక ఒక ప్రమాణంతో అర్థం కలిగే స్థలాలలో మరో ప్రమాణంతో అర్థం కలగదని నియమం లేదు.** యధా సంభవముగా రెండూ మూడూ కలుగవచ్చును. (వహ్నిని ప్రత్యక్షంగా గమనించినా ధూమంతో అనుమానించవచ్చును. ఉపమానంతో పోల్చనూ వచ్చును). అందుచేత "కేవల వ్యతిరేకి" అగు అనుమానము, అర్ధాపత్తి, రెండూ ఆదరణీయములే.

## 3/60 "అర్ధాపత్తి - ప్రమలు - వాటి స్వరూపభేదం ఉదాహరణలు"

అర్ధాపత్తి గూడా ప్రమాణమును, దాని వలన వచ్చిన ప్రమను బోధించును.

"ఉపపాదక కల్పనకు హేతువయిన ఉపపాద్య జ్ఞానము అర్ధాపత్తి"

ఉపపాదకము = సంపాదకము

ఉపపాద్యము = సంపాద్యము - ఈ పేర్లతో అర్ధాపత్తిని గూర్చి **విచార సాగరమునందు** వివరణ చేశాము. కనుక శబ్దభేదమేగాని లక్షణ భేదం లేదు. ఇందులో

ఉపపాదక జ్ఞానము - అర్ధాపత్తి ప్రమ

ఉపపాద్య జ్ఞానము – అర్థాపత్తి ప్రమాణము

అనగా, కుదరని విషయమును తెలిసికొనటం – అర్థాపత్తి ప్రమాణం. దాన్ని కుదిర్చే విషయం ఊహించటం – అర్తాపత్తి ప్రమ.

“పీనో దేవదత్తో దివా నభుంక్తే” – A

రాత్రి భోజీ దేవదత్తః – B

బాగా బలంగా ఉన్న దేవదత్తుడు

పగలు భోజనం చేయడం లేదు – A

బహుశః వాడు తప్పక రాత్రి భోజనం చేస్తున్నాడు – B

ఇందులో A లో కుదరని అంశము. బలంగా ఉండడం – భోజనం లేకున్నా

B - వాని బలాన్ని కుదిర్చే అంశం రాత్రి భోజనం

అయ్యా! మీరు చెప్పే ఉపపాదకం మా వ్యాపకం, (అగ్ని) మీ, ఉపపాద్యం మా వ్యాప్యము సమానముగదా! కాగా వ్యాపక (వహ్ని) జ్ఞానమునకు హేతువయిన వ్యాప్య జ్ఞానం (ధూమం) అర్థాపత్తి గదా! చివరకిది మా అనుమానమే గదా”

సమా – నిజమే

స్థూలత్వం రాత్రి భోజనమునకు వ్యాప్యము. (ధూమం) స్థూలత్వ సహితుడు దేవదత్తుడు (పర్వతం వహ్ని కలది) “ఈ రెండు జ్ఞానములు కలిగినచోట ‘రాత్రి భోజనం వలన’ అన్న అనుమితి కలుగుతుంది. స్థౌల్యేన రాత్రి భోజనం అనుమినోమి.

“పగలు తినని వాడు (తింటున్నట్లు కనబడలేదు)

రాత్రి భోజనము లేకుండా స్థూలం కావటం కుదరదు – స్థూలత్వ అనుపపత్తి”

దీనివలన ‘రాత్రి భోజనం’ ఊహిస్తే అర్థాపత్తి. “స్థౌల్యానుపపత్త్యా రాత్రి భోజనం కల్పయామి” అని అర్థాపత్తి. కనుక

ఉపపాద్యం భోజనరహితుని బలము. దాని యొక్క అనుపపత్తి వలన

ఉపపాదకమయిన రాత్రి భోజన కల్పన - అర్థాపత్తి ప్రమ.

అందుకు హేతువయిన అనుపపత్తి జ్ఞానం అర్ధాపత్తి ప్రమాణము.

అర్థం = ఉపపాదకము = దాని యొక్క ఆపత్తి = కల్పన.

అర్థాపత్తి - ప్రమ

అర్థము దేనివలన కల్పన అవుతుందో అది - అర్థాపత్తి - ప్రమాణము.

ఈ అర్థాపత్తి "2" రకాలు :

1) దృష్టార్థాపత్తి 2) శ్రుతార్థాపత్తి

1) దృష్టమయిన విషయం మీద వచ్చినది దృష్టార్థాపత్తి

పీనోదేవదత్తో - దీనియందు స్థూలత్వం చూచాము కనుక దృష్టార్థాపత్తి.

2) శ్రుతార్థాపత్తి (విన్నదాన్ని బట్టి చేసే ఊహ)

"గృహే అసన్ దేవదత్తో జీవతి" - దేవదత్తుడు శతవర్షములు జీవిస్తాడని, జాతకం ద్వారా నిశ్చయం. వాడు కాశీకి వెళ్లి చాలాకాలం రాలేదు. కనుక ఇంట్లో లేడు. అయినా అతను బ్రతికి ఉంటాడని నిశ్చయిస్తాము. ఇది శ్రుతం = వినబడిన ఆయుర్దాయం మీద ఆధారపడి చేసే అర్థాపత్తి. వాడు గృహమునందుంటే వాడు బ్రతికి ఉండడం మనం చూచేవాళ్లము.

ఇచ్చట గృహమునందు లేని దేవదత్తుని ఆయువు - ఉపపాద్యము.

వాని బాహ్యసత్త - ఉపపాదకము.

ఈ శ్రుతార్థాపత్తి 2 రకములు.

1) అభిధానానుపపత్తి = (శబ్దం తేవలసిన చోటు)

2) అభిహితానుపపత్తి (అర్థం కల్పించటం)

**1) ద్వారం - పిధేహి - 'తలుపు మూయవలెను' = అభిధానము**

ఇందులో 'తలుపు' అంటే 'మూయవలెనని పదం అధ్యాహారం చేస్తాము - సందర్భాన్ని బట్టి. కనుక ఇది అర్థాపత్తి. ఇదే అభిధానానుపపత్తి వలన వచ్చిన

'శ్రుతార్థాపత్తి'.

"అన్వయ జ్ఞానం కోసం చేసే శబ్దప్రయోగం అభిధానం" అది సరిగా చేయక 'ద్వారం' అని ఆగడం - అభిధానానుపపత్తి. ఇక్కడ 'మూయవలెను - పిధేహి అను పద - అధ్యాహారం (తేవటం) అర్థాపత్తి.

**2) అభిహితానుపపత్తి - (అర్థ - అధ్యాహారం)**

"స్వర్గకామోయజేత" దీనిని కుదర్చాలి. యాగం ఎలా స్వర్గం ఇస్తుంది? చేసిన రోజుననే యాగం అయిపోతుంది. దీనివలన జీవునకు ఎపుడో మరణానంతరం స్వర్గం ఎలా వస్తుంది ? కనుక తప్పక యాగానంతరం కర్మఫలం వచ్చేదాకా కర్మ జన్యమయిన "అపూర్వం" పుడ్తుందని కల్పించాలి.

కనుక ఉపపాద్యం - స్వర్గ సాధనత.

ఉపపాదకం - అపూర్వము.

స్వర్గసాధనత దృష్టం కాదు. శ్రుతం. "అపూర్వం" ఏ పదం యొక్క అర్థం కాదు. ప్రత్యేక విషయం. కనుక అర్థం. శ్రుత - అర్థాపత్తి.

## 4/61 అర్థాపత్తి - ఉదాహరణములు

1) "తరతిశోకం ఆత్మవిత్"

ఆత్మవేత్త సంసార రూపశోకమును దాటుతాడు. శోకం మిథ్య అయితేనే గదా! జ్ఞానంతో తొలగుతుంది. కనుక "బంధం మిథ్య" అను విషయాన్ని కల్పించాలి. ఉపపాదకం - బంధ మిథ్యాత్వం ఉపపాద్యం - శోకతరణం జ్ఞానకృతం. శ్రుతార్థాపత్తి ఇది.

2) జీవబ్రహ్మాభేదము - ఇది శ్రుతము. ఉపపాద్యం విద్వాంసులకు దృష్టము గూడా. ఇది స్వరూపతః సంభవించదు. అందుకని భేదం ఉపాధికృతం. స్వరూపకృతం కాదు - కనుక ఉపాధికృతమన్న సంగతి ఉపపాదకము.

ఉపపాద్యజ్ఞానము ప్రమాణం

ఉపపాదకం - ప్రమ